# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-06-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **పీఎం కిసాన్ 17వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో విడుదల చేయనున్నారు.**
2. **పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి భారతీయ జనతా పార్టీ తరపున గెలుపొందిన భూపతిరాజు శ్రీనివాస వర్మ కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.**
3. **గ్రామీణ ప్రాంతాల నుంచి రాజధాని వరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎయిమ్స్ తరహా వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.**
4. **ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ఈ మధ్యాహ్నం 2 గంటలకు విడుదల కానున్నాయి.**
5. **తిరుమల శ్రీవేంకటేశ్వస్వామి వారి ఆర్జిత సేవలకు సంబంధించిన సెప్టెంబర్ నెల కోటాను ఈఉదయం తిరుమల తిరుపతి దేవస్థానం ఆన్‌లైన్‌లో విడుదల చేసింది.**

==========================

పీఎం కిసాన్ 17వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ రోజు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో విడుదల చేయనున్నారు. ఈ పథకం ద్వారా మొత్తం 9 కోట్ల 26 లక్షల మంది రైతుల ఖాతాల్లో 20 వేల కోట్ల రూపాయలు జమ కానున్నాయి. అదే విధంగా పారా ఎక్స్‌టెన్షన్ వర్కర్లుగా పని చేసేందుకు శిక్షణ పొందిన 30వేల మందికిపైగా స్వయం సహాయ బృందాల మహిళలకు ప్రధానమంత్రి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయనున్నారు. దేశవ్యాప్తంగా 732 కృషి విజ్ఞాన కేంద్రాలు, లక్షకుపైగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, 5 లక్షల ఉమ్మడి సేవా కేంద్రాలతోసహా 2.5 కోట్ల మంది రైతులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకోనున్నారని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ తెలిపింది.

--------------------------

పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి భారతీయ జనతా పార్టీ తరపున గెలుపొందిన భూపతిరాజు శ్రీనివాస వర్మ కేంద్ర భారి పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని తన ఛాంబర్‌లో ఆయన ఈ రోజు బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డితో పాటు రాష్ట్రానికి చెందిన బీజేపీ శాసనసభ్యులు వై.సుజనా చౌదరి, అరమిల్లి రాధాకృష్ణ,

బొలిశెట్టి శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, సోము వీర్రాజు, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

---------------------------

ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కల్యాణ్‌కు గన్నవరం విమానాశ్రయంలో జనసేన పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో వచ్చిన ఆయన రహదారి మార్గంలో మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత పవన్ కల్యాణ్ ఈ రోజు మొదటిసారి సచివాలయానికి రానున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఆయనకు రెండో బ్లాక్‌లోని ఛాంబర్‌ను కేటాయించింది. పవన్ కల్యాణ్ రేపు తన ఛాంబర్‌లో ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. మరోవైపు.. ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంగా విజయవాడలోని జలవనరులశాఖ విశ్రాంతి భవనాన్ని ప్రభుత్వం కేటాయించింది.

---------------------------

వైద్య ఆరోగ్యశాఖలో సమూల మార్పులు తీసుకొచ్చి గ్రామీణ ప్రాంతాల నుంచి రాజధాని వరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎయిమ్స్ తరహా వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. తిరుపతిలోని రుయా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన అనంతరం నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో వైద్యశాఖ పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేస్తామన్నారు. రాష్ట్రంలో 5 కోట్ల 30 లక్షల మందికి క్యాన్సర్ పరీక్షలు చేస్తామని, బాధితులకు సత్వరం చికిత్స ప్రారంభించి మొదటిదశలోనే నిలువరిస్తామని తెలిపారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ద్వారా 68 లక్షలమంది చిన్నారులకు క్యాన్సర్ పరీక్షల కార్యక్రమాన్ని త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారని సత్యకుమార్ పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 26వ తేదీ వరకు మూడు రోజుల పాటు సమావేశాలు జరుగుతాయి. వాస్తవానికి రేపటి నుంచే సమావేశాలు జరగవలసి ఉండగా రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ బక్రీద్ సెలవులో ఉండటంతో శాసనసభ సమావేశాల తేదీల్లో మార్పు చోటుచేసుకుంది. కాగా.. ఈ నెల 24వ తేదీన ముందుగా ప్రోటెం స్పీకర్‌ను ఎన్నుకున్న తర్వాత శాసనసభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది.

---------------------------

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ఈ మధ్యాహ్నం 2 గంటలకు విడుదల కానున్నాయి. ఈ ఉదయం 11 గంటలకు విడుదల చేస్తామని అధికారులు ముందుగా ప్రకటించినా.. ఆ తర్వాత సమయంలో మార్పు చేశారు. ఈ పరీక్షలకు దాదాపు లక్షా 40 మంది హాజరయ్యారు. మొదటి ఏడాది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను ఈ నెల 26వ తేదీన విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

---------------------------

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా తెల్లరేషన్ కార్డుదారులకు బియ్యంతోపాటు పంచదార, కందిపప్పును సరఫరా

చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నెల 20వ తేదీ నుంచి రేషన్ షాపులకు బియ్యం, కందిపప్పు, నూనె ప్యాకెట్లు, పంచదారను సరఫరా చేయాల్సి ఉంది. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు ఒంగోలులోని వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌కు వచ్చిన చక్కెర, కందిపప్పు నాణ్యతతోపాటు అక్కడికి చేరిన ప్యాకెట్లను తూకం వేసి పరిశీలించారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి వీటిని పంపిణీ చేయనున్నారు.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వస్వామి వారి ఆర్జిత సేవలకు సంబంధించిన సెప్టెంబర్ నెల కోటాను ఈ ఉదయం తిరుమల తిరుపతి దేవస్థానం ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను ఈ నెల 21వ తేదీన ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. అదే రోజు మధ్యాహ్నం సెప్టెంబర్ నెల వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 22వ తేదీ ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను కూడా విడుదల చేస్తామని టీటీడీ తెలిపింది.

---------------------------

ప్రపంచ ర్యాంకింగ్‌లో విశాఖపట్నం పోర్టు అథారిటీ ఉత్తమ స్థానాలకు చేరుకుందని పోర్టు ఛైర్మన్ అంగముత్తు తెలిపారు. 2023 సంవత్సరానికి విశాఖ పోర్టు అథారిటీ 62.29 ఇండెక్స్ పాయింట్లతో 20వ స్థానం, కంటైనర్ పోర్టు పనితీరు సూచికలో 19వ స్థానంలో నిలిచిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక ఏడాదిలోనే 102 స్థానాలు మెరుగవడం నౌకాశ్రయం గణనీయమైన పురోగతిని తెలియజేస్తోందన్నారు. పని సామర్థ్యం, పెట్టుబడులు, నూతన సాంకేతిక అంశాల అమలులో పోర్టు అద్భుత పనితీరు చూపెడుతోందని వెల్లడించారు. ఈ కారణంగా ప్రపంచ సూచీల్లో మంచి స్థానంలో నిలవడమే కాకుండా ప్రపంచ సముద్రయాన రంగంలో పోటీని తట్టుకొని ప్రగతి సాధిస్తోందని పోర్టు ఛైర్మన్ పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో 2019 సంవత్సరానికి ముందు ప్రవేశపెట్టిన పథకాలు ఇప్పటికీ కొనసాగుతున్నట్లయితే.. వాటికి పాత పేర్లను తిరిగి పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలను ఆదేశించింది. 2019-24 మధ్య ప్రవేశపెట్టిన కొత్త పథకాలకు పెట్టిన పేర్లనూ తొలగించాలని సూచించింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు పేర్లు లేకుండానే పథకాలు కొనసాగించాలని పేర్కొంది. రాజకీయ పార్టీల రంగులు, జెండాలతో ఉన్న పాసుపుస్తకాలు, లబ్ధిదారుల కార్డులు, సర్టిఫికెట్ల జారీని నిలిపివేయాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

---------------------------

శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనార్థం తిరుమలకు వచ్చే సామాన్య భక్తులకు సంతృప్తికర దర్శనం కల్పించేలా తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు కృషిచేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు ఆదేశించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో సంయుక్త కార్యనిర్వహణాధికారులు గౌతమి, వీరబ్రహ్మం సహా ఇతర అధికారులతో కలిసి ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామలరావు మాట్లాడుతూ.. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా, సంతృప్తి చెందేలా సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా దర్శనం, వసతి, నాణ్యమైన అన్న ప్రసాదాలు, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలను అత్యున్నతంగా అందించడం మనందరి బాధ్యత అని స్పష్టంచేశారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన భావాలను దేశ ప్రజలతో పంచుకునే మనసులో మాట  మన్ కీ బాత్ కార్యక్రమం 111వ సంచిక  ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి మన్ కీ బాత్ కార్యక్రమం ఇది. ప్రజలు తమ సలహాలు, సూచనలను ఈ నెల 28లోగా టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-7800కు ఫోన్ చేసి గాని, నరేంద్ర మోదీ యాప్ లేదా మై గౌవ్ ఫోరమ్, ఇతర వేదికల ద్వారా తెలియజేయవచ్చు.

=======================